సాక్షి
అనంతపురం
శుక్రవారం । 22 । మార్చి । 2024



టన్ను చీనీ రూ.22 వేలు

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు పలికాయి.



కిలో టమాట రూ.12

స్థానిక కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.12, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

శుక్రవారం	శనివారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.32	సెహరీ : 5.05



న్యూస్‌రీల్

పెరిగిన ఓటర్లు



అనంతపురం అర్బన్: తుది ఓటర్ల జాబితా ప్రకటన అనంతరం ఓటరుగా నమోదు, తొలగింపుల ప్రక్రియ కొనసాగింది. ఈ క్రమంలో జిల్లాలో ఓటర్ల సంఖ్య పెరిగింది. ఓటరు జాబితా సవరణలో భాగంగా ఈ ఏడాది జనవరి 22న విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 19,94,544 మంది ఓటర్లు ఉన్నారు. ఆ తరువాత ఓటరుగా నమోదుకు, ఓటు తొలగింపునకు దరఖాస్తులు స్వీకరిస్తూ వస్తున్నారు. అధికారిక నివేదిక ప్రకారం ఈనెల 19 వరకు జిల్లాలో ఓటర్లు 19,98,841 మంది ఉన్నారు. ఈ ప్రకారం చూస్తే 4,297 మంది ఓటర్లు పెరిగారు.

కొత్తగా 30 వేల మంది..

తుది ఓటర్ల జాబితా ప్రకటించిన జనవరి 22వ తేదీ నుంచి ఈనెల 19వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి కొత్తగా 30,022 మందిని ఓటర్లుగా నమోదు చేశారు. అలాగే, ఓట్ల తొలగింపునకు అందిన దరఖాస్తులపై విచారణ అనంతరం 25,655 ఓట్లను తొలగించారు. ఇక సవరణ ఓట్లు 70 ఉన్నాయి.

654 లైసెన్స్‌డ్ ఆయుధాల డిపాజిట్



అనంతపురం: జిల్లాలో ఇప్పటి వరకూ 654 లైసెన్స్‌డ్ ఆయుధాలు డిపాజిట్ చేయించినట్లు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎలెక్షన్ కమిషన్ నిబంధనల మేరకు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఆయుధాలు (తుపాకులు) పోలీసు శాఖ వద్ద డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో 703 మందికి లైసెన్స్ ఉండగా, వారి వద్ద 734 ఆయుధాలు ఉన్నట్లు వెల్లడించారు. వీటిని డిపాజిట్ చేసే ప్రక్రియలో భాగంగా పోలీసుస్టేషన్ స్థాయిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఇంకా 80 ఆయుధాలు డిపాజిట్ చేయించాల్సి ఉందన్నారు. వారు కూడా త్వరగా డిపాజిట్ చేయాలని సూచించామన్నారు.

22 నుంచి టీసీసీ పరీక్షలు



అనంతపురం ఎడ్యుకేషన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ (టీసీసీ-2024) డ్రాయింగ్, టైలరింగ్,ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఈనెల 22 నుంచి 25 వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. హాల్‌టికెట్లు www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు గంట ముందే చేరుకోవాలని పేర్కొన్నారు. హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

35,792 మందికి ఇంటి నుంచే ఓటుకు అవకాశం

అనంతపురం అర్బన్: ఈ ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులు, పలు కారణాలతో మంచానికి పరిమితమైన వారు ఇంటి నుంచే ఓటు హక్కు (హోమ్ ఓటింగ్) వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. జిల్లాలో ఈ కేటగిరీల వారు మొత్తం 35,792 మంది ఉన్నట్లు ఎన్నికల అధికారులు లెక్కగట్టారు. హోమ్ ఓటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 8 నియోజకవర్గాల పరిధిలో 85ఏళ్లు ఆపై వయసున్న వారు 9,799 మంది ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 3,873 మంది, మహిళా ఓటర్లు 5,926 మంది ఉన్నారు. ఇక దివ్యాంగ ఓటర్లు 25,993 మంది ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఇలా..

- 85 ఏళ్లు ఆపై ఉన్న వారు రాయదర్గం నియోజకవర్గంలో 1,323 మంది, ఉరవకొండ- 1,057, గుంతకల్లు-1,441 మంది, తాడిపత్రి-1,069 మంది, శింగనమల- 1,239, అనంతపురం అర్బన్- 1,690, కళ్యాణదుర్గం-842, రాప్తాడు నియోజకవర్గంలో 1,138 మంది ఉన్నారు.
- దివ్యాంగ ఓటర్లు రాయదుర్గం నియోజకవర్గంలో 3,448 మంది, ఉరవకొండ- 3,446, గుంతకల్లు-2,670, తాడిపత్రిలో 4,127, శింగనమల- 3,362,అనంతపురం అర్బన్- 1,725, కళ్యాణదుర్గం-2,092, రాప్తాడు నియోజకవర్గంలో 4,123 మంది ఉన్నారు.

హంస వాహనంపై వీణాపాణి



హంస వాహనంపై దర్శనమిస్తున్న శ్రీవారు



తిరువీధుల్లో స్వామి దర్శనం కోసం వేచివున్న భక్తులు



తిరువీధుల్లో హంస వాహనంపై విహరిస్తున్న ఖాద్రీశుడు

కదిరి: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం స్వామివారు వీణాపాణిగా హంస వాహనంపై చదువుల తల్లి సరస్వతీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మ వాహనమైన హంస పరమ హంసకు ప్రతీక. హంసకు ఒక ప్రత్యేకత ఉంది. అది పాలను, నీళ్లను వేరు చేయగలదు. అంటే మంచి, చెడును గ్రహించ గలిగిన అపురూపమైన శక్తి దాని సొంతం. అందుకే ఉపనిషత్తులు పరమేశ్వరునిగా అభివర్ణిస్తున్నాయి. నారసింహుడు హంస వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో దర్శనమివ్వడం భక్తులలో అహంభావాన్ని తొలగించి శరణాగతిని కల్గిస్తాడని అర్చక పండితులు తెలిపారు. చేతిలో వీణ, విశేష దివ్యాభరణాలు, పట్టు పీతాంబరాలు ధరించిన స్వామివారు తిరువీధుల్లో ఊరేగుతుంటే శ్రీవారి కరుణాకటాక్షం కోసం భక్తులు తిరువీధుల్లో ఎదురు చూశారు. ఉభయ దారులుగా పట్టణానికి చెందిన తోటంశెట్టి రాజుగోపాల్‌శెట్టి కుటుంబీకులు వ్యవహరించారని ఆలయ ఈఓ వెండిదండి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నేడు సింహ వాహనంపై దర్శనం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఖాద్రీశుడు మాడవీధుల్లో సింహ వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. మనుషులలో జంతు స్వాభావికమైన ప్రవృత్తిని అదుపు చేసుకోవాలని లోకానికి చాటిచెప్పడానికే శ్రీవారు సింహవాహనంపై ఊరేగుతారని భక్తుల నమ్మకం.

సార్వత్రికం.. సంసిద్ధం



- చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్న యంత్రాంగం
- ఎన్నికల సామగ్రి పంపిణీ, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లలో నిమగ్నం
- ఇప్పటికే సిబ్బంది నియామకం పూర్తి

అనంతపురం అర్బన్: ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో యంత్రాంగం వేగం పెంచింది. ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేస్తోంది. జేఎన్‌టీయూలో 8 నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల ఏర్పాట్లు చురుగ్గా చేపడుతోంది. మరోవైపు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేస్తోంది.

సిబ్బంది నియామకం పూర్తి

ఎన్నికల కోసం సిబ్బంది నియామకాన్ని ఇప్పటికే పూర్తి చేశారు. నిర్వహణ కమిటీలు, సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులు, నోడల్ అధికారులు కలిపి మొత్తం 14,885 మంది ఉద్యోగులను నియమించారు. వీరిలో పోలింగ్ సిబ్బంది (పీఓ, ఏపీఓ, 4 సిబ్బంది)-13,800 మంది, నిర్వహణ కమిటీల సిబ్బంది- 570, నోడల్ అధికారులు- 33, సెక్టార్ అధికారులు-241, సెక్టార్ పోలీసు అధికారులు-241 మందిని ఎంపిక చేశారు. దీంతో పాటు జిల్లా సరిహద్దు రాష్ట్రాల నుంచి డబ్బు, మద్యం, వస్తువులు, తదితర సామగ్రి అక్రమ రవాణా నిరోధించేందుకు 38 అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను నెలకొల్పారు. రాయదుర్గం నియోజకవర్గంలో 9 చెక్‌పోస్టులు, ఉరవకొండ-5, గుంతకల్లు-2, తాడిపత్రి-3, శింగనమల-3, అనంతపురం-4, కళ్యాణదుర్గం-9, రాప్తాడు నియోజకవర్గంలో 3 చొప్పున చెక్‌పోస్టులు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక ఎన్నికల నిర్వహణకు కమిటీలు కూడా ఏర్పాటు చేశారు. ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్) బృందాలు- 45, ఎఫ్ఎస్ (ఫ్లయింగ్ స్క్వాడ్) బృందాలు-78, ఎస్ఎస్ (స్టాటిక్ సర్వైలెన్స్) బృందాలు- 93, వీఎస్ (వీడియో సర్వైలెన్స్) బృందాలు-18, వీవీ (వీడియో వ్యూయింగ్) బృందాలు-18, ఎంసీఎంసీ (మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ)- ఒకటి చొప్పున నియమించారు. ఈ బృందాలన్నింటినీ సమన్వయం చేసుకునేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా సెంట్రలైజ్డ్ కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. వెరసి జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా యంత్రాంగం అన్ని చర్యలు పకడ్బందీగా చేపడుతోంది.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉంది. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలూ చేపడుతున్నాం. ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్, తదితర కమిటీలు ఏర్పాటు చేశాం. ప్రత్యేకంగా సెంట్రలైజ్డ్ కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం. ఎన్నికల నిర్వహణకు సిబ్బందిని నియమించాం. జేఎన్‌టీయూలో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నాం. ఇక ఎన్నికల సామగ్రి పంపిణీకి ఆయా నియోజకవర్గ కేంద్రాలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. మద్యం, నగదు, తదితర వాటి అక్రమ రవాణా అడ్డుకట్టకు అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం.

– ఎం.గౌతమి,
జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్



జేఎన్‌టీయూలో కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ గౌతమి (ఫైల్)

పోలింగ్ కేంద్రాలు, క్రిటికల్ (క్లిష్టమైన) పోలింగ్ కేంద్రాలు

నియోజకవర్గం	మొత్తం పోలింగ్ కేంద్రాలు	క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు
రాయదుర్గం	296	109
ఉరవకొండ	263	150
గుంతకల్లు	276	108
తాడిపత్రి	274	180
శింగనమల	293	171
అనంతపురం	292	95
కళ్యాణదుర్గం	261	95
రాప్తాడు	281	132
మొత్తం	2,236	1,032

జిల్లాలో ఓటర్లు (ఈనెల 19వ తేదీ నాటికి)

పురుష ఓటర్లు	9,88,463
మహిళా ఓటర్లు	10,10,137
థర్డ్‌జెండర్ ఓటర్లు	241
మొత్తం	19,98,841
సర్వీస్ ఓటర్లు	2,115
ఎన్ఆర్ఐ ఓటర్లు	121
పీడబ్ల్యూడీ(దివ్యాంగ) ఓటర్లు	25,993

మోడల్ పోలింగ్ కేంద్రాలు	36
యూత్ పోలింగ్ కేంద్రాలు	2
మహిళ పోలింగ్ కేంద్రాలు	8
దివ్యాంగుల పోలింగ్ కేంద్రాలు	2

ఓట్ల లెక్కింపు కేంద్రాలు

రాయదుర్గం	జేఎన్‌టీయూ మెయిన్ బిల్డింగ్ మొదటి ఫ్లోర్ నార్త్ వింగ్
గుంతకల్లు	జేఎన్‌టీయూ మెయిన్ బిల్డింగ్ మొదటి ఫ్లోర్ సౌత్ వింగ్
తాడిపత్రి	జేఎన్‌టీయూ మెయిన్ బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్ సౌత్ వింగ్
ఉరవకొండ	జేఎన్‌టీయూ ఎ-బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్
శింగనమల	జేఎన్‌టీయూ ఎ-బ్లాక్ మొదటి ఫ్లోర్
కళ్యాణదుర్గం	జేఎన్‌టీయూ ఎ-బ్లాక్ మొదటి ఫ్లోర్
అనంతపురం	జేఎన్‌టీయూ ఈసీఈ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్
రాప్తాడు	జేఎన్‌టీయూ ఈసీఈ బ్లాక్ మొదటి ఫ్లోర్

'రబీ' నష్టం అంచనాలు పంపండి

- డీఏఓ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: రబీకి సంబంధించి పంట నష్టం అంచనాలు సిద్ధం చేసి పంపాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. గురువారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయం నుంచి టెక్నికల్ ఏఓలు వెంకటకుమార్, బాలనాయక్, రాకేష్‌నాయక్‌తో కలిసి డివిజన్ ఏడీఏలు, ఏఓలతో వెబ్‌కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈశాన్య రుతుపవనాలు ప్రభావం చూపకపోవడంతో రబీలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నట్లు తెలిపారు.ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో 14 మండలాలు ఉన్నాయన్నారు. బెళుగుప్ప, బొమ్మనహాళ్, డి.హిరేహాళ్, గుత్తి, గుంతకల్లు, కణేకల్లు, పెద్దపప్పూరు, పుట్లూరు, తాడిపత్రి, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, యాడికి, యల్లనూరు మండలాల్లో వర్షాధార పంటల కింద సాగు చేసిన పప్పుశనగతో పాటు ఇతర పంటలకు సంబంధించి ప్రాథమిక నష్టం వివరాలు రెండు రోజుల్లో అందజేయాలని ఆదేశించారు. ఈ వివరాల ఆధారంగా మరోసారి రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తుది ముసాయిదా సమగ్రంగా తయారు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది నిర్దేశించిన పథకాలు, కార్యక్రమాల పురోగతి వివరాలు కూడా సమర్పించాలని ఆదేశించారు. ఎనికల ప్రవర్తనా నియమావళి మేరకు క్షేత్రస్థాయిలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఆధార్ సీడింగ్ చేయించుకోండి

- జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి

అనంతపురం ఎడ్యుకేషన్: 2019, 2020, 2021, 2022 సంవత్సరాల్లో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షల్లో ఎంపికై ఈ సంవత్సరం 9, 10, 11, 12 తరగతులు చదువుతూ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు/రెన్యువల్ చేసుకున్న ప్రతి విద్యార్థి తప్పకుండా తమ బ్యాంక్ అకౌంటుకు ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి సూచించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్‌సీడింగ్ చేయించుకోకపోతే స్కాలర్‌షిప్ జమ కాదని వెల్లడించారు. విద్యార్థి మెరిట్ కార్డ్, ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్ తీసుకుని సంబంధిత బ్యాంకుకు వెళితే ఆధార్ సీడ్ చేస్తారన్నారు. నేరుగా విద్యార్థి ఆధార్‌కు సీడ్ అయిన బ్యాంక్ ఖాతాల్లో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానంలో స్కాలర్‌షిప్ జమ చేస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు వెంటనే చర్యలు తీసుకోవాలని డీఈఓ సూచించారు.

అన్నదాతకు ఆర్థిక దన్ను

- బాబు హయాం కన్నా రెట్టింపు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్
- చంద్రబాబు హయాంలో వేరుశనగ ఎకరాకు రూ. 18 వేలు
- నేడు రూ.38 వేలకు పెరిగిన గరిష్ట రుణపరిమితి
- అన్ని పంటల రైతులకూ సాయం



వేరుశనగ పంట

అనంతపురం అగ్రికల్చర్: రైతు వేసే ప్రతి అడుగులోనూ సర్కారు తోడుగా నిలుస్తోంది. మాటల్లోనే కాకుండా చేతల్లోనూ చూపిస్తోంది. ఏటా ఖరీఫ్ రాగానే పంట పెట్టుబడులకు రైతులు ఇబ్బంది పడకుండా జూన్‌లోనే మొదటి విడతగా వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ కింద రూ.7,500 క్రమం తప్పకుండా ఇస్తూ భరోసా ఇస్తున్నారు. మరోవైపు బ్యాంకుల ద్వారా పంట రుణాల రెన్యూవల్స్, కొత్త రుణాల పంపిణీకి ప్రాధాన్యత ఇస్తున్నారు. పంట పెట్టుబడులు, వస్తున్న దిగుబడులు బేరీజు వేసుకుని గరిష్ట రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ఖరారు చేస్తూ రైతులకు మేలు చేస్తున్నారు. దీంతో రైతులు ఖరీఫ్ సేద్యం సాఫీగా సాగిస్తున్నారు.

పెరిగిన పరపతి..

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ సర్కారు రైతులకు బ్యాంకుల ద్వారా అందించే పంట రుణాలకు సంబంధించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెరిగేలా చర్యలు చేపట్టింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఆధ్వర్యంలో నాబార్డు, లీడ్‌బ్యాంకు, ప్రధాన బ్యాంకర్లు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ (డీఎల్‌టీసీ) సమావేశమై వాస్తవ పరిస్థితులపై చర్చించి రుణపరిమితి ప్రతిపాదనలు తయారు చేసి రాష్ట్ర సాంకేతిక కమిటీ (ఎస్ఎల్‌టీసీ)కి పంపించి ఖరారు చేయడం ఆనవాయితీగా వస్తోంది. చంద్రబాబు హయాంలో ఈ ప్రక్రియ తూతూ మంత్రంగా చేపట్టేవారు. దీంతో రైతులకు పెద్దగా ప్రయోజనం కలగలేదు. అయితే, 2019 తర్వాత రైతులకు మేలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా పంట రుణ సదుపాయం కల్పిస్తూ వస్తోంది. 2018లో వేరుశనగ ఎకరాకు రూ.18 వేలు ఇస్తుండగా 2024లో అది రూ.38 వేలకు పెంచడం గమనార్హం. ఇలా ఈ ఐదేళ్ల కాలంలోనే టీడీపీ హయాంలో కన్నా దాదాపు అన్ని రకాల పంటలకు రెట్టింపు స్థాయిలో రుణ పరిమితి ఇస్తుండటం విశేషం. దీంతో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు పంట రుణాల రెన్యువల్స్, కొత్త రుణాల కోసం బ్యాంకులను వినియోగించుకుంటున్న పరిస్థితి నెలకొంది.

2018, 2024లో ప్రధానపంటల గరిష్ట రుణ పరిమితి ఇలా..

పంట పేరు	2024లో	2018లో
	(ఎకరాకు రూ.లలో)	(ఎకరాకు రూ.లలో)
వేరుశనగ	38 వేలు	18 వేలు
వరి	43 వేలు	25 వేలు
జొన్న	25 వేలు	12 వేలు
మొక్కజొన్న	33 వేలు	16 వేలు
కంది	20 వేలు	12 వేలు
పప్పుశనగ	34 వేలు	20 వేలు
పత్తి	42 వేలు	31 వేలు
పచ్చిమిరప	76 వేలు	49 వేలు
ఎండుమిరప	ఒక లక్ష	66 వేలు
మల్బరీ	1.05 లక్షలు	55 వేలు
టమాట	90 వేలు	55 వేలు
ఉల్లి	44 వేలు	30 వేలు
కరివేపాకు	47 వేలు	35 వేలు
అరటి	1.20 లక్షలు	55 వేలు
చీనీ, నిమ్మ	63 వేలు	35 వేలు
దానిమ్మ	97 వేలు	56 వేలు
కళింగర, కర్బూజా	55 వేలు	35 వేలు
ద్రాక్ష	ఒక లక్ష	80 వేలు
మామిడి	38 వేలు	25 వేలు

వీఏహెచ్‌ఏలకు 45 రోజుల శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా పరిధిలో ఇటీవల కొత్తగా నియమితులైన 457 మంది విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ల (వీఏహెచ్ఏ)కు ఏప్రిల్ 1 నుంచి 45 రోజుల శిక్షణ కార్యక్రమం ఉంటుంది. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ... ఉరవకొండ డివిజన్‌లో 150 మంది, అనంతపురం డివిజన్‌లో 135 మంది, పెనుకొండ డివిజన్‌లో 67 మంది, ధర్మవరం డివిజన్‌లో 65 మంది, కదిరి డివిజన్‌లో 40 మంది వీఏహెచ్ఏలు విధుల్లో చేరినట్లు తెలిపారు. వీరందరినీ ఆరు బృందాలుగా విభజించి బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి ప్రాంతీయ పశు శిక్షణాకేంద్రంలో రెండు బృందాలకు, సిద్ధరాంపురం పశు క్షేత్రంలో ఓ బృందానికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే అనంతపురంలోని జేడీఏ కార్యాలయంలో రెండు బృందాలకు, సాయినగర్‌లోని పశువైద్యశాలలో ఓ బృందానికి శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందుకోసం ఒక్కో సెంటర్‌కు ముగ్గురు రిసోర్సు పర్సన్లను నియమించినట్లు తెలిపారు. పశుసంవర్ధకశాఖ అమలు చేస్తున్న అన్ని రకాల పథకాలతో పాటు సమగ్ర పాడి, పశుపోషణ, పశువైద్యసేవలు, ఆర్‌బీకే విశిష్టతపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తారని వెల్లడించారు.

రేపు ప్రవీణ్ ప్రకాష్ రాక

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఈనెల 23న జిల్లాలో పర్యటించనున్నారు. ఇందుకు సంబంధించి పాఠశాల విద్య ఆర్జేడీ, ఇంటర్ విద్య ఆర్జేడీ, జిల్లా విద్యాశాఖ అధికారి, ఆర్ఐఓ, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈకు అధికారిక సమాచారం అందించారు. 23న ఉదయం 6.15 గంటలకు ఆయన అనంతపురం చేరుకుంటారు. ట్రైబ్స్ అవసరం లేకుండా కంప్యూటర్ ఆధారంగా ఆర్జీటీ విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్న కేంద్రాన్ని పరిశీలించనున్నారు. అలాగే జిల్లాలోని వివిధ స్కూళ్లు, కళాశాలలను సందర్శించనున్నారు. కాగా ప్రవీణ్ ప్రకాష్ పర్యటన అధికారికంగా ఖరారు కావడంతో ఉపాధ్యాయుల్లో గుబులు పట్టుకుంది. ఏ స్కూల్‌కు వస్తారో...ఎలాంటి లోపాలను గుర్తించి బాధ్యులను చేస్తారోననే ఆందోళన చాలామంది టీచర్లలో నెలకొంది. విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, డెప్యూటీ డీఈఓలు,ఎంఈఓలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్జేడీ రాఘవరెడ్డి ఆదేశించారు.

క్లుప్తంగా

ఘనంగా వసంతోత్సవం



పూజలు నిర్వహిస్తున్న మఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వసంతోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగిసాయి. ఉదయం విశేష పూజల అనంతరం గవిమఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, మఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ ఆధ్వర్యంలో అశ్వ వాహనోత్సవాన్ని నిర్వహించారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం




ఆర్ట్స్ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సైన్స్ విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా అధునాతన సాంకేతికత విద్యను బోధించడానికి కళాశాల నిధులతో ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. కంప్యూటర్ సైన్స్ విభాగానికి అదనంగా అందజేసిన కంప్యూటర్లు విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటాయని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు కళాశాల సౌకర్యాలను ఉపయోగించుకుని మెరుగైన ఉపాధిని పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఏసీ కో–ఆర్డినేటర్ కిరణ్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి శివశంకర్, ఏఓ రమణ, అధ్యాపకులు విజయ నాయక్ పాల్గొన్నారు.

ఒత్తిడి తగ్గాలి..నైపుణ్యం పెరగాలి

- ఇంజినీరింగ్ కష్టం అనే అపోహ తొలగేలా ప్రత్యేక శిక్షణ
- తరగతులు ప్రారంభమయ్యే ముందే విద్యార్థులకు కౌన్సెలింగ్
- ఇంటర్ విద్యకు భిన్నంగా బీటెక్ నాలెడ్జ్‌పై పరిజ్ఞానం అవసరం
- ఏర్పాట్లు చేయాలని వర్సిటీలకు ఏఐసీటీఈ ఆదేశాలు



అనంతపురం: ఇంజినీరింగ్ తరగతులు ప్రారంభమయ్యే ముందే విద్యార్థులను మానసికంగా సంసిద్ధం చేయాలని వర్సిటీల యాజమాన్యాలను అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ఆదేశించింది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను జారీ చేసింది. మారిన బోధనా ప్రణాళికను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లుగా ఏఐసీటీఈ గత రెండేళ్లుగా చేపట్టిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఈ క్రమంలో ఐఐటీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలనూ కౌన్సిల్ పరిగణలోకి తీసుకుంది. అలాగే ప్రాక్టికల్ నాలెడ్జ్‌తో కూడిన విద్య అందుబాటులోకి తెచ్చేందుకు నూతన జాతీయ విద్యా విధానం జారీ చేసిన మార్గదర్శకాలతో ఇంజినీరింగ్ రెండో ఏడాది నుంచే పారిశ్రామిక సంస్థల భాగస్వామ్యంతో పాఠ్య ప్రణాళికలో మార్పు చేశారు. దీంతో ఇంజినీరింగ్ విద్యార్థులు ఒక్కసారి మూస విధానం నుంచి స్వతంత్రంగా ఆలోచించే విద్యా విధానంలో అడుగు పెట్టాల్సి వచ్చింది. ఇది కూడా మానసిక ఒత్తిడికి కారణమవుతోందని ఏఐసీటీఈ అధ్యయనంలో తేలింది. దీంతో ఇంజినీరింగ్ అంటేనే కష్టమనే అపోహ అందరిలోనూ నెలకొంది. ఈ అపోహయను తొలగించేలా తరగతులు ప్రారంభమయ్యే ముందే విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చేలా మార్గదర్శకాలను కౌన్సిల్ జారీ చేసింది.

బ్యాక్‌లాగ్స్ భారమై...

ఇంజినీరింగ్ విద్యార్థులు కేవలం 18 నుంచి 20 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులవుతున్నారు. సింహభాగం విద్యార్థులు మొదటి సంవత్సరంలోనే ఫెయిల్ అవుతున్నారు. ఇంటర్మీడియట్ విద్యా ప్రణాళిక, బీటెక్ విద్యా ప్రణాళిక విభిన్నంగా ఉండడమే ఇందుకు కారణం. ఇంటర్ వరకూ బట్టీ చదువులకు అలవాటు పడిన విద్యార్థులు... ఇంజినీరింగ్‌లో ప్రవేశించేటప్పటికి భిన్న విధానాలను అవలంభించాల్సి వస్తోంది. కంప్యూటర్ సైన్స్‌లో గణితం భాష ఒక్కసారిగా మారిపోతుంది. రెండో ఏడాదికి వచ్చే సరికి అనేక కంప్యూటర్ లాంగ్వేజ్‌లను విద్యార్థి నేర్చుకోవడమే కాకుండా, దాని ఆధారంగా ప్రయోగాత్మక ఫలితాలు సాధించాల్సి ఉంటుంది. సివిల్, మెకానికల్‌లోనూ ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంటుంది. విద్యార్థి వ్యక్తిగతంగా నైపుణ్యాలు పెంచుకుంటే తప్ప ఈ పరిస్థితుల్లో ముందుకెళ్లడం కష్టం. ఈ కారణంగా బీటెక్ మొదటి, రెండో సంవత్సరాల్లో విద్యార్థులకు బ్యాక్‌లాగ్స్ ఎక్కువగా ఉంటున్నాయి. ఇదే విద్యార్థి మానసిక ఒత్తిడికి కారణమవుతోంది. విద్యార్థి మానసిక స్థితిని గుర్తించి నిపుణుల ద్వారా కౌన్సెలింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

అధునాతన కోర్సులకు అధ్యాపకుల కొరత:

విపరీతమైన క్రేజ్ నెలకొన్న కంప్యూటర్ సైన్సెస్, దాని అనుబంధ కోర్సులను ఇబ్బడిముబ్బడిగా ఆయా కళాశాలల్లో ప్రవేశపెట్టారు. గత మూడేళ్లలో డేటా సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో అధునాతన కోర్సులు బోధించే అధ్యాపకుల కొరత ఏర్పడింది. ఆయా కోర్సుల్లో విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపడేలా బోధించే అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ అనివార్యమైంది. ఈ అంతరాన్ని పూడ్చడానికి రెండో ఏడాది నుంచే సంబంధిత రంగాల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించేందుకు ప్రాజెక్ట్‌ల రూపకల్పన తప్పనిసరి చేస్తూ నిబంధన విధించారు. దీంతో ఏటా మార్కెట్‌లోకి వస్తున్న విద్యార్థుల్లో కేవలం 8 శాతం మంది మాత్రమే నైపుణ్యతతో ఉంటున్నారని పారిశ్రామిక వర్గాలు పేర్కొంటున్నాయి. మొత్తం ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఆరు నెలలకోసారి విద్యార్థి మానసిక ధోరణిని పరిశీలించాలని ఏఐసీటీఈ సూచించింది.

విద్యార్థుల శ్రేయస్సుపై ప్రత్యేక దృష్టి



ఇంజినీరింగ్ విద్యా ప్రణాళికపై అవగాహన పెంపొందించేందుకు కౌన్సెలింగ్ చేపట్టనున్నాం. విద్యార్థి శ్రేయస్సుపై ప్రత్యేక దృష్టి సారించాం. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యా ప్రణాళికలో వచ్చిన మార్పులపై తరగతుల ప్రారంభంలోనే సంసిద్ధులను చేస్తున్నాం.

– డాక్టర్ జీవీఆర్ శ్రీనివాసరావు, వీసీ, జేఎన్‌టీయూఏ

బొలెరో ఢీ - వ్యక్తి మృతి



గోపాల్ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహన చోదకుడు మృతి చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... కంబదూరు మండలం ఎగువపల్లికి చెందిన గోపాల్ (44) బతుకు తెరువు కోసం కళ్యాణదుర్గానికి వలస వచ్చి కుటుంబంతో కలసి పార్వతీనగర్‌లో నివాసముంటున్నారు. టైలరింగ్ పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ఉదయం తన ఇద్దరు కుమారులతో కలసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా పవర్ ఆఫీస్ సమీపంలోకి చేరుకోగానే అనంతపురం వైపు నుంచి వేగంగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో గోపాల్‌తో పాటు ఆయన కుమారులు తరుణ్, తేజేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. చికిత్సకు స్పందించక గోపాల్ మృతి చెందాడు. తరుణ్‌కు కుడి కాలు విరిగింది. తేజేశ్వరరావుకు ఎడమ కాలు విరిగింది. వీరిద్దరూ సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. కాగా, గోపాల్‌కు లక్ష్మి, శిల్ప అనే ఇద్దరు భార్యలున్నారు. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్ నియంత్రణ కోల్పోవడతో బొలెరో సైతం రోడ్డుపై అడ్డంగా బోల్తాపడింది. విషయం తెలుసుకున్న వెంటనే సీఐ హరినాథ్ స్పందించారు. ప్రమాదానికి కారణమైన బొలెరో డ్రైవర్ నరేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మలోబులేశుడి ఉత్సవాలు ప్రారంభం



ఆలయంలోని మూలవిరాట్

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు కొండపై వెలసిన మలహోబిల లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి వేకువజామునే అభిషేకం, కలశారాధన, హోమం, మూలమంత్ర హవనము తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. 22వ తేదీన స్వామి సుదర్శన హోమం, కలశారాధన హోమం ఉంటాయి. అలాగే 23న లక్ష్మీ హోమం, గరుడోత్సవం నిర్వహించనున్నారు. 24న శ్రీవారి కల్యాణోత్సవం, 25న రథోత్సవం, 26న పార్వేట ఉత్సవం, పరుష ఉంటుంది. 27న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

బాలికను ఢీకొన్న ప్రైవేట్ అంబులెన్స్

ఉరవకొండ: కర్ణాటకకు చెందిన ఓ ప్రైవేట్ అంబులెన్స్ ఢీకొని బాలిక గాయపడింది. ఉరవకొండ మండలం చిన్నముష్టూరుకు చెందిన ప్రమీల తన తల్లిదండ్రులతో కలసి రాకెట్లకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న సమయంలో ఉరవకొండ నుంచి వేగంగా వెళుతున్న అంబులెన్స్ ఢీకొంది. అనంతరం పరిస్థితి విషమంగా ఉన్న ప్రమీలను అదే అంబులెన్స్‌లో మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు చిన్నముష్టూరుకు చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

విగ్రహం కూల్చివేత దుండగులను కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతపురం రూరల్: దివంగత డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని కూల్చివేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురం రూరల్ మండలం రుద్రంపేట పంచాయతీ పరిధిలోని విమలాఫరూక్ నగర్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కూల్చివేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనంతరం దుండగులను కఠినంగా శిక్షించాలంటూ ఆందోళన చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాదిక్‌వలి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, ఎంపీటీసీ సభ్యురాలు మహబూబీ, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ రాజునాయక్ మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారన్నారు. ఈ క్రమంలో ఎన్నికల్లో తమ పార్టీలకు పరాభవం తప్పదని భావించిన టీడీపీ, జనసేన పార్టీ నాయకులే ఈ నీచానికి ఒడిగట్టి ఉంటారని ఆరోపించారు. ప్రశాంతంగా ఉన్న ప్రాంతాల్లో విద్వేషాలను రగులుస్తున్న వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపతినాయుడు, రామ్మూర్తి, వెంకటేష్‌నాయక్, పరంధామ, సుధీర్‌రెడ్డి, రామచంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు చేసిన పోలీసులు

అనంతపురం: దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం కూల్చివేత ఘటనకు సంబంధించి అనంతపురం నాల్గో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. విగ్రహ కూల్చివేత విషయం తెలిసిన వెంటనే సీఐ ఆర్.ప్రతాపరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు, అలజడులు సృష్టించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని సీఐ ప్రతాపరెడ్డి స్పష్టం చేశారు.

తక్కువ ధర అంటూ నకిలీ బంగారం

- మోసపోయిన హైదరాబాదీలు
- రూ. 10 లక్షలతో ఉడాయించిన దుండగులు
- వారం రోజులు ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



నకిలీ బంగారు దండను చూపుతున్న బాధితుడు

పెద్దవడుగూరు: తక్కువ ధరకే రెండు కిలోల బంగారం ఇస్తామంటూ నకిలీ బంగారం అంటగట్టి రూ.10 లక్షలు అపహరించుకెళ్లిన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు తెలిపిన మేరకు... హైదరాబాద్‌కు చెందిన శివకృష్ణ, అతని తండ్రి నరసింహులు వారి ఇంటి పక్కన ఉన్న అనిల్‌తో సన్నిహితంగా ఉండే వారు. కొన్ని రోజుల క్రితం నరసింహను అనిల్ కలసి... తన స్నేహితుడు కొత్త ఇంటిని కట్టుకునే క్రమంలో పాత ఇంటిని తొలగించి పునాదులు తీస్తుండగా రెండు కిలోల బంగారం బయటపడిందని, డబ్బు అవసరం ఉండడంతో రూ.10 లక్షలకే కిలో బంగారం విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాడని తెలిపాడు. అనిల్ మాటలతో ఆశపడిన నరసింహ రూ. 10 లక్షలకే రెండు కిలోల బంగారాన్ని కొనుగోలు చేసేలా బేరం కుదుర్చుకున్నాడు. వారం రోజుల క్రితం డబ్బు సమకూర్చుకుని అనిల్‌ను సంప్రదించడంతో గుత్తి సమీపంలోని టోల్‌ప్లాజా వద్దకు రావాలని తెలిపాడు. దీంతో ఈ నెల 13న గుత్తికి చేరుకున్న తండ్రీకొడుకులు ఓ లాడ్జీలో అద్దెకు దిగారు. 14వ తేదీ ఉదయం టోల్‌ప్లాజా వద్దకు చేరుకోగానే అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న అనిల్ వారిని కలిశాడు. అనంతరం పామిడి మండలం రామరాజుపల్లి వద్ద ముళ్ల పొదల్లోకి పిలుచుకెళ్లి రూ.10 లక్షలు తీసుకుని బంగారం పూసల గుత్తి చేతికి ఇచ్చి పోలీసుల నిఘా ఉందని, వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ హడావుడి చేశాడు. దీంతో అదే రోజు రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరిన నరసింహ, ఆయన కుమారుడు శివకృష్ణ... శుక్రవారం ఉదయం తమకు తెలిసిన బంగారం వర్తకుడి వద్దకెళ్లి పూసలు చూపించారు. పరీక్షించిన ఆయన అవి నకిలీవని చెప్పడంతో కంగుతిన్న వారు వెంటనే తెలంగాణ పోలీసులను ఆశ్రయించారు. అయితే మోస పోయింది ఎక్కడో అక్కడికే వెళ్లి ఫిర్యాదు చేయాలని తెలంగాణ పోలీసులు తెలపడంతో గురువారం ఉదయం పెద్దవడుగూరు పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే నేరం నగదు మార్చుకున్నది పామిడి పోలీసు స్టేషన్ పరిధిలో కావడంతో అక్కడికెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించడంతో బాధితులు పామిడికి వెళ్లారు.

చిన్నారులకు 2డీ ఎకో, థైరాయిడ్ పరీక్షలు

అనంతపురం మెడికల్: ప్రపంచ పుట్టుకతో వచ్చు లోపాల మాసోత్సవంలో భాగంగా గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీఈఐసీ సెంటర్‌కు వచ్చిన చిన్నారులకు 2డీ ఎకో, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణ స్వామి పేర్కొన్నారు. గురువారం డీఈఐసీలో చిన్నారులకు స్క్రీనింగ్ నిర్వహించారు. అవసరమైన చిన్నారులకు పరీక్షలు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ శ్రీవిద్య, మెడికల్ ఆఫీసర్ మల్లీశ్వరి, దంత వైద్యురాలు ముత్యాలమ్మ, స్పీచ్ థెరపిస్టు చంద్రకళ, సైకాలజిస్టు సుందర్రాజు, మేనేజర్ రజిత పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

గుంతకల్లు రూరల్: స్థానిక భీమిరెడ్డి కాలనీకి చెందిన సుజాత అనే మహిళ గురువారం ఉదయం గుడికి వెళ్తుండగా గుర్తు తెలియని దుండగులు ద్విచక్రవాహనంలో వచ్చి ఆమె మెడలో 1.5 తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. బాధితురాలు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

‘పురం’ మార్కెట్‌కు 57 టన్నుల చింతపండు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ చింతపండు కొనుగోళ్లతో కళకళలాడుతోంది. గురువారం ఈ సీజన్‌లోనే అత్యధికంగా 57.70 టన్నుల (57 లారీలు) చింతపండు రాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం వేసినట్లు కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. అందులో కరిపులి రకం క్వింటా గరిష్టంగా రూ.24 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, సగటున రూ.13 వేల ప్రకారం పలికిందన్నారు. అలాగే ఫ్లవర్ రకం క్వింటా గరిష్టంగా రూ.11 వేలు, కనిష్టంగా రూ.4 వేలు, సగటున రూ.6 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు మార్కెట్ కార్యదర్శి వెల్లడించారు.

శేష వాహనంపై చెన్నకేశవుడు

యాడికి: మండల కేంద్రంలోని శివలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నాలుగో రోజు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవుడిని శేష వాహనంపై భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య వీధుల్లో ఊరేగింపు వైభవంగా సాగింది. కార్యక్రమంలో అర్చకుడు హరికృష్ణ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచు కాసా చంద్ర మోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్ వార్డు మెంబర్లు తిరుపతి, రామచంద్ర తదితరు లు పాల్గొన్నారు.



దాడిలో తల్లీకొడుకుకు గాయాలు



దాడి జరిగిన తీరు వివరిస్తున్న పద్మావతి

గుంతకల్లు రూరల్: గడ్డి వామి పొట్టును దొంగలిస్తూ పట్టుబడిన ఇద్దరు యువకులు కక్ష పెంచుకుని తల్లీ కొడుకుపై దాడి చేశారు. బాధితులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన రమేష్, తిప్పక్క దంపతులు తమ దొడ్డిలో ఆవుల పెంపకాన్ని చేపట్టారు. రమేష్ తమ్ముడు రామకృష్ణ భాగానికి వచ్చిన వామి దొడ్డిని అదే గ్రామానికి చెందిన పద్మావతి కౌలుకు తీసుకుని తన కుమారులతో కలసి పాడి పోషణ చేపట్టింది. ఈ క్రమంలో రమేష్ కొడుకులు హరీష్, రవి రోజూ పద్మావతికి చెందిన వామి నుంచి పొట్టు దొంగలించి తమ ఆవులకు వేసుకునేవారు. ఈ విషయాన్ని గుర్తించిన పద్మావతి కొడుకులు బుధవారం సాయంత్రం కాపు కాసి రవి, హరీష్ పొట్టును దొంగలిస్తుండగా చుట్టుపక్కల ఉన్న రైతులకు, గ్రామస్తులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టించారు. గ్రామస్తులు మందలించడంతో రవి, హరీష్ కక్ష పెంచుకుని గురువారం ఉదయం వామి వద్దకెళ్లిన పద్మావతి, ఆమె చిన్నకుమారుడు నరసింహులుపై దాడి చేశారు. అదే సమయంలో పొలం నుంచి అక్కడికి చేరుకున్న పద్మావతి పెద్దకుమారుడు శ్రీనివాసులు కంట్లో కారం కొట్టి దాడి చేశారు. స్థానికులు గమనించి అక్కడకు చేరుకుంటుండగా రవి, హరీష్ అక్కడి నుంచి పారిపోయారు. గాయపడిన పద్మావతి, శ్రీనివాసులను గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

‘పల్లె’.. పాట్లు





టీడీపీకి చెందిన హనుమంతుకు కండువావేస్తున్న దృశ్యం

కొత్తచెరువు: తిమ్మిని బమ్మిని చేయడం తెలుసు గానీ.... అయితే రకరకాలుగా తిమ్మిని దమ్మిని చేయడం, ఆ దమ్మిని తిమ్మిని చేయడం మనం ఎన్నడూ వినలేదు. అయితే ఇది కూడా సాధ్యమేనని నిరూపించారు టీడీపీకి చెందిన మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి. గిమ్మిక్కు రాజకీయాలకు పెట్టింది పేరుగా ఖ్యాతిగాంచిన పల్లె... వరుస వైఫల్యాలతో ఈ సారి పుట్టపర్తి టికెట్‌ను చేజార్చుకున్నారు. అయినా తిమ్మిని దమ్మిని చేసి తన కోడలికి టికెట్ వచ్చేలా చేసుకున్నారు. ఇప్పుడు దమ్మిని తిమ్మిని చేసేందుకు నానా పడబాట్లు పడుతున్నారు. ఇందుకు కొత్తచెరువులోని బీసీ కాలనీ వేదికైంది. గురువారం తన కోడలు పల్లె సింధూరరెడ్డి తరఫున కుమారుడు కిషోర్‌రెడ్డితో కలసి ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. అయితే ప్రజల నుంచి స్పందన లేక పోవడంతో స్థానిక నేతలను ఆదేశించి సంచార జాతులకు చెందిన 30 మంది మహిళలను రప్పించుకున్నారు. వీరితో పాటు పార్టీకి చెందిన కొందరికి ఒకొక్కరికి రూ.500 చొప్పున ఇచ్చి పార్టీ కండువాలు కప్పి టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. మొత్తానికి లేటు వయసులో లేటెస్ట్ రాజకీయం నడిపిన పల్లెను చూసి స్థానిక టీడీపీ నాయకులే ముక్కున వేలేసుకున్నారు. మొత్తానికి యాడున్నా... పల్లెకు పడబాట్లు తప్పడం లేదని జనం నవ్వుకున్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

అనంతపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. కేంద్ర సాయుధ బలగాలతో పాటు స్థానిక పోలీసులు ఎక్కడికక్కడ వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లాలోకి ప్రవేశించే అన్ని మార్గాల్లో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే అనుమతిస్తున్నారు. అలాగే ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్లనూ జల్లెడ పడుతున్నారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లరాదని, పెద్ద మొత్తంలో నగదు, ఆభరణాలు, నగలు తీసుకెళ్లాల్సి వస్తే సంబంధిత పత్రాలు ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



పంపనూరు సిటీ పార్కులో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పర్యావరణాన్ని ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మొక్కలను పెంచడం వల్ల సకాలంలో వర్షాలు కురుస్తాయని అటవీశాఖ బీట్ అధికారి దామోదర్ సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని పంపనూరు వద్ద ఉన్న సిటీ పార్కులో చెత్త తొలగింపు పనులు చేపట్టారు. పార్కులో ఉన్న చెత్త చెదారాన్ని సిబ్బందితో కలిసి తొలగించారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి, వాటి సంరక్షణకు కృషి చేయాలని పేర్కొన్నారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

చెన్నేకొత్తపల్లి: విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓలు మున్వర్‌బాషా, ప్రసన్నకుమార్ నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు చెన్నేకొత్తపల్లిలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

వర్తమాన సాహిత్యాన్ని ప్రోత్సహించాలి



కవయిత్రి లక్ష్మీశ్యామ్‌ను సత్కరిస్తున్న తెలుగు వెలుగు సంస్థ ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: కవిత్వం ఓ సామాజిక ప్రయోజనం కోసమేనని నిత్య చైతన్యస్ఫూర్తిని రగిలించే కవిత్వంలో అనంత వాసుల పాత్ర అమోఘమని తెలుగు వెలుగు సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు టీవీరెడ్డి అన్నారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా గురువారం తెలుగు వెలుగు సంస్థ కార్యాలయంలో కవితోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలసాహిత్యంలో కృషి చేస్తున్న కవయిత్రి లక్ష్మీశ్యామ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా టీవీ రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల కవిత్వంలో మహిళల పాత్ర గణనీయంగా పెరుగుతుండటం సంతోషకరమన్నారు. వర్తమాన సాహిత్యాన్ని ప్రోత్సహించాలని కోరారు. అనేక సాహితీ సంస్థల ద్వారా ఎన్నో సాహితీ కార్యక్రమాలు రావడం తద్వారా ఎంతో మంది యువ కవులకు చక్కటి వేదిక లభిస్తోందన్నారు. కార్యక్రమంలో తెలుగు వెలుగు సంస్థ కార్యదర్శులు మస్తానప్ప, సామాజిక సేవా కార్యకర్త కేవీఎస్ చలపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల శ్రమదానం



క్యాంపస్‌లో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ డి.మురళీధర్ రావు ఆధ్వర్యంలో క్యాంపస్ బీఈడీ కళాశాల ఆవరణలో గురువారం శ్రమదానం చేశారు. క్యాంపస్ పాఠశాలలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించారు. అదే విధంగా క్యాంపస్ స్కూల్ విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్‌ఆర్ సదాశివా రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు భారీ ర్యాలీ చేపట్టారు.

పిల్లలను బడుల్లో చేర్పించాలి

చెన్నేకొత్తపల్లి: విద్యాహక్కు చట్టం కింద బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని ఎంఈఓలు మున్వర్ బాషా, ప్రసన్నకుమార్ నాయుడు సూచించారు. గురువారం స్థానిక ఎమ్మార్సీలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళికి లోబడి ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించరాదన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు వారు పని చేసే గ్రామాల్లో పర్యటించాలన్నారు. పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అనంతరం నాడు–నేడు కింద పలు పాఠశాలలకు వచ్చిన పరికరాలను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది రాంసుబ్బారెడ్డి, శివారెడ్డి, వెంకటేష్, శివయ్య, పుష్పలత పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తాం

- వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలి
- దేశానికే ఆదర్శంగా నిలిచిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 27వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'



అశోక్ నగర్‌లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



బీజేపీ మహిళా యువమోర్చా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి విశాల రెడ్డి, బీజేపీ నాయకురాళ్లను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే అనంత

అనంతపురం కార్పొరేషన్: రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని 27వ డివిజన్ అశోక్‌నగర్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. ప్రతి గడప గడపకు వెళ్లిన ఎమ్మెల్యే గత టీడీపీ ప్రభుత్వం, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు చేసి మేలు, ఇంటి వద్దకే అందిస్తున్న సేవల గురించి తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ఇంటి వద్దకే అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలకు సంక్షేమం అందుతోందన్నారు. ఇటువంటి వ్యవస్థ తమ రాష్ట్రంలోనూ ఉంటే బాగుంటుందని ఇతర రాష్ట్రాల ప్రజలు కోరుతున్నారని తెలిపారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. నగరంలో 74 సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సమయాల్లో మాత్రమే కాకుండా అవసరమైతే వేకువ జామున, అర్ధరాత్రి అయినా.. సిబ్బంది ఇళ్లకు వచ్చి ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్నారన్నారు. ఇటువంటి ఆదర్శవంతమైన వ్యవస్థ, అవినీతి రహిత పాలన కొనసాగాలంటే మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కొనసాగాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వం అవినీతి కోరల్లో కూరుకుపోయిందన్నారు.

ప్రతిపక్షాల్లో వణుకు

ప్రజలకు చేస్తున్న మంచితో ప్రతిపక్షాలకు భయం పట్టుకుందన్నారు. మరోసారి భంగపాటు తప్పదని కుట్ర రాజకీయాలకు తెరలేపారన్నారు. ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలకు లేదని మండిపడ్డారు. కేవలం అధికార దాహం తప్ప మరో ఆలోచన లేదన్నారు. వలంటీర్లను భయభ్రాంతులకు గురి చేసేలా ఎల్లో మీడియా, సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

వైఎస్సార్ విగ్రహం తోసేయడం దురదృష్టకరం

అనంతపురం నియోజకవర్గ పరిధిలోని రుద్రంపేటలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహాన్ని తోసేయడం దురదృష్టకరమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో జిల్లా ప్రశాంతంగా ఉందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటే క్రమశిక్షణకు మారుపేరని స్పష్టం చేశారు. ప్రజలకు మేలు చేయాలన్న ఆలోచన తప్ప, అలజడి వాతావరణం సృష్టించాలన్న ఆలోచన ఉండదన్నారు. నాలుగున్నరేళ్లకుపైగా నియోజకవర్గంలో ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించేలా చర్యలు తీసుకున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ అవకాశం దొరికినప్పుడల్లా రోడ్డెక్కి అలజడి వాతావరణం సృష్టించిన సందర్భాలను ప్రజలు మర్చిపోలేదన్నారు. వైఎస్సార్ విగ్రహాన్ని తోసేసిన ఘటనపై జిల్లా పోలీసు శాఖ విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.

బీజేపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

బీజేపీ మహిళా యువమోర్చా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి, బేటీ బచావో బేటీ పడావో జిల్లా కన్వీనర్ కులూరు విశాల రెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. గురువారం అశోక్‌నగర్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమంలో విశాల రెడ్డికి ఎమ్మెల్యే అనంత కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యావంతం మంజుల, డిప్యూటీ మేయర్లు కోగటం విజయ భాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థ నాయక్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్పొరేటర్లు భోగాతి జయమ్మ, టీవీ చంద్రమోహన్ రెడ్డి, కమల్ భూషణ్, దుర్గాదేవి, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, శ్రీదేవి, సైపుల్లాబేగ్, పార్టీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, డైరెక్టర్ శోభారాణి, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, రామయ్య, రాధాకృష్ణ, రామకృష్ణ, సాకే కుళ్లాయస్వామి, అనిల్‌కుమార్ గౌడ్, హనుమంతు, ఏ1రఫి, సతీష్, గౌస్‌బేగ్, జానీ, జావెద్, భారతి, రాజేశ్వరి, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

47వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 47వ డివిజన్‌లో శుక్రవారం ఉదయం 7 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. డివిజన్‌లోని సోమనాథ నగర్‌లోని రామాలయం నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలి

చెన్నేకొత్తపల్లి: ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఆర్డీటీ సంస్థ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుజ్జల సురేష్ కోరారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎంతో వెనుకబడిన ప్రాంతం అయిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఫాదర్ ఫెర్రర్ ఆర్డీటీ సంస్థను స్థాపించారని తెలిపారు. విద్య, వైద్యం కోసం ఎంతో కృషి చేశారన్నారు. విదేశీ దాతలు అందిస్తున్న విరాళాలతో ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టారని పేర్కొన్నారు. ఇన్ని కార్యక్రమాలు చేస్తున్న ఆర్డీటీ ఎఫ్.సీ.ఆర్.ఏను (ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేటరీ యాక్ట్) కేంద్ర ప్రభుత్వం వెంటనే రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్డీటీ ద్వారా ఎంతో మంది ఉపాధి పొందుతున్నారన్నారు.

బీఎస్‌ఎఫ్ జవాన్ల కవాతు



కవాతు చేస్తున్న బీఎస్‌ఎఫ్ జవాన్లు

రాప్తాడురూరల్: రానున్న ఎన్నికల్లో ఓటు కల్గిన ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ బీఎస్‌ఎఫ్ జవాన్లు గురువారం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కవాతు నిర్వహించారు. పాపంపేట, కళ్యాణదుర్గం రోడ్డు, కక్కలపల్లికాలనీ పంచాయతీ పరిధిలోని నందమూరినగర్, పిల్లిగుండ్లకాలనీ, చిన్నంపల్లి పంచాయతీల్లో కవాతు చేపట్టారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి



ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విభిన్న, ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్‌రసూల్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎన్జీఓ హోంలో వయోవృద్ధులు ఓటు హక్కును ఏవిధంగా వినియోగించుకోవాలన్న అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ అబ్దుల్ రసూల్ మాట్లాడుతూ.. 80 సంవత్సరాలు పైబడి నడవలేని స్థితిలో ఉన్న వయోవృద్ధులు ఇంటి దగ్గరే ఉండి ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఎన్నికల సంఘం స్వీప్ అనే యాప్‌ను రూపొందించిందన్నారు. నడవలేని వయోవృద్ధులు ముందుగా తమ వివరాలను ఈ యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వయోవృద్ధులు, వికలాంగులకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు ఉంటాయని ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

అనంతపురం టవర్‌క్లాక్: త్వరలో జరగనున్న ఎన్నికల్లో వయోవృద్ధులు ఓటుహక్కును వినియోగించుకోవాలని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దన్న గౌడు సూచించారు. గురువారం స్థానిక ఎన్జీఓ హోంలో ఎన్నికలపై వయోవృద్ధులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పెద్దన్న గౌడు మాట్లాడుతూ.. వయోవృద్ధులు ఓటు వేసేలా ఎన్నికల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అధికారుల సూచన మేరకు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి

- పూలకుంటలో విస్తృత ప్రచారం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



ప్రచారంలో పాల్గొన్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, పార్టీ మండల కన్వీనర్ తదితరులు

రాప్తాడు రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని అనంతపురం రూరల్ మండల ఎంపీపీ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి పేర్కొన్నారు. గురువారం అనంతపురం రూరల్ మండలం పూలకుంటలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. మరోమారు వైఎస్సార్‌సీపీని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించడంతో ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు అందాయన్నారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పేదల కళ్లల్లో ఆనందం చూడాలనే తాపత్రయంలో సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది రూపాయలు బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. ఎక్కడా పైసా అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు డబ్బులు జమ చేసినట్లు వెల్లడించారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత రాప్తాడు నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందినట్లు తెలిపారు. రూరల్ మండలంలో ప్రతి గ్రామంలోనూ సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, ప్రభుత్వ కార్యాలయాల పక్కా భవనాలను నిర్మించారన్నారు. వచ్చే ఎన్నికల్లో హిందూపురం ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన శాంతమ్మ, రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ పోతలయ్య నాయకులు భాస్కర్‌రెడ్డి, ఓబిరెడ్డి, మల్లిరెడ్డి, లింగాల గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నరేష్, అక్కులప్ప, కొడిమి పవన్, తిరుపాల్‌రెడ్డి, మంగల నాగేంద్ర, సర్పంచ్‌లు సావిత్రి శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ నటుడు ఆర్వీ ప్రసాద్ కన్నుమూత



అనంతపురం కల్చరల్: నటుడిగా, కవిగా, చిత్రకారుడిగా, కళాపోషకుడిగా రాణించిన ఆర్వీ ప్రసాద్ (73) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. వాణిజ్య పన్నుల శాఖలో ఏసీటీఓగా పదవీ విరమణ చేసిన ఆర్వీ ప్రసాద్ సహజంగా నటనపై ఉన్న ఆసక్తితో దశాబ్దాలుగా లలితకళాపరిషత్తులో సాగే సాంస్కృతిక వేడుకలకు సహకారం అందించేవారు. ప్రస్తుతం ఎల్కేపీ సహాయ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. అల్లూరి సీతారామరాజు, సంభవం నాటికల్లో పోషించిన పాత్రలు ఆయనకు పేరు తెచ్చిపెట్టాయి. ఆర్వీ ప్రసాద్ మరణ వార్త తెలుసుకున్న కళాకారులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎల్కేపీలో జరిగిన సంతాప సమావేశంలో అధ్యక్ష కార్యదర్శులు గాజుల వెంకట సుబ్బయ్య, పద్మజ, సీనియర్ నటులు రామగోవిందు, రామాంజనేయులు, సోమిరెడ్డి తదితరులు ఆర్వీ ప్రసాద్ కళారంగ సేవలను గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులోనూ ఆర్వీ ప్రసాద్ ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు.

తాగునీరు వృథా చేయొద్దు

- నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్



అనంతపురం కార్పొరేషన్: తాగునీటిని వృథా చేయకుండా అవసరం మేరకు వినియోగించుకోవాలని కమిషనర్ మేఘ స్వరూప్ నగర ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని కమిషనర్ కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రకటనలో కమిషనర్ ఏమన్నారంటే.. 'మంచి నీటి, పారిశుధ్యం ప్రాముఖ్యతపై దృష్టిసారించడానికి నీటి వనరుల స్థిరమైన నిర్వహణకు యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ ప్రపంచ నీటి దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. 2024 ప్రపంచ స్థాయిలో శాంతి, సహకారాన్ని పెంపొందించడంలో శాంతి కోసం నీటిని పరపతి థీమ్‌తో ఈ సంవత్సరం ముందుకెళ్లనున్నట్లు వెల్లడించారు. నీటి విలువను తెలుసుకోవడానికి దానిని వృథా చేయకుండా అవగాహన కల్పించడానికి ఏటా మార్చి 24న నీటి దినోత్సవం జరుపుకుంటారని పేర్కొన్నారు. గరపాలక సంస్థ పరిధిలో ఉన్న అన్ని పాఠశాలలో నీటి ఆవశ్యకతపై వ్యాస రచన, పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నీటిని శుద్ధి చేసే విధానాన్ని విద్యార్థులకు తెలియజేయడానికి శ్రీకృష్ణ దేవరాయ పాఠశాల విద్యార్థులను ముద్దలాపురం ఫిల్ట్రేషన్ ప్లాంట్‌కు తీసుకెళ్లి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

29 నుంచి ఆల్ ఇండియా లాక్రోస్ టోర్నీ




క్రీడాకారులతో జిల్లా లాక్రోస్ కమిటీ సభ్యులు

అనంతపురం: ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకూ ఆల్ ఇండియా లాక్రోస్ టోర్నమెంట్ జరగనుంది. ఈ నేపథ్యంలో అనంతపురం జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న లాక్రోస్ క్రీడాకారులకు రెండు రోజులుగా నీలం సంజీవ రెడ్డి స్టేడియంలో కోచింగ్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో అనంతపుర జిల్లా లాక్రోస్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి రమణ, సెక్రెటరీ షబ్బీర్, జోనల్ సెక్రెటరీ రమణ, రాధిక, బుల్లె లింగ ప్రసాద్ తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని కర్నూలు రోడ్డులో గురువారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బైక్ డివైడర్‌ను ఢీ కొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. చీరాలకు చెందిన వెంకటేష్ అనే వ్యక్తి రెండు రోజుల క్రితం గుత్తిలోని బంధువుల ఇంటికి వచ్చాడు. గురువారం బైక్‌లో బస్టాండ్ వైపు వెళ్తుండగా కర్నూలు రోడ్డులోని బిశ్వాస్ క్లినిక్ వద్ద అదుపు తప్పి బైక్ డివైడర్‌ను ఢీ కొంది. వెంకటేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోరకు అనంతపురం తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



అద్భుత దృశ్యం

నగరంలోని వడియం పేట సమీపంలో గురువారం సాయంత్రం సూర్యుడు అస్తమిస్తున్న దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. పగలంతా తన కిరణాలతో వేడిని వెదజల్లే సూర్యుడు.. సాయంత్రం కాగానే ఇక వెళ్లొస్తా అంటూ మెల్లగా ఆకాశంలోకి జారుకున్నాడు. ద్విచక్ర వాహనదారుల మధ్య నుంచి వెళ్తున్నట్లుగా ఉన్న దృశ్యాలు స్థానికులను ఆకట్టుకున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం



మాట్లాడుతున్న కేఎస్‌ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కేఎస్‌ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ కవితా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంస్కృతం, తెలుగు, హిందీ, ఆంగ్ల విభాగాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శంకరయ్య, సంస్కృత ఉపన్యాసకులు డాక్టర్ కేకేవీ శర్మ, హిందీ ఉపన్యాసకులు శశాంక మౌళి మాట్లాడుతూ.. సూరదాసు, ప్రేమ్‌చంద్ తదితరుల కవితలను వివరించారు డాక్టర్ రామకృష్ణ కష్టజీవుల శ్రమలో నుంచి కవిత్వం పుడుతుందనే విషయాన్ని ఉదాహరణగా చెప్పారు. శ్రీశ్రీ రాసిన కవిత్వాన్ని హావభావాలతో డాక్టర్ వై.అంజన్ రెడ్డి వివరించారు. ఎక్కడ దెబ్బ తగిలినా మొదట కన్ను స్పందించి కన్నీళ్లు కారుస్తుందని.. సమాజంలో వచ్చిన కష్టాన్ని చూసి మొదట కవి స్పందిస్తాడనే విషయాన్ని ఆంగ్ల అధ్యాపకురాలు పర్వీన్ ఉర్దూ కవితలో చెప్పారు. హిందీ ఉపన్యాసకరాలు రమాదేవి హిందీ కవితా మాధుర్యాన్ని వినిపించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



కనుముక్కలలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



సూచనలు ఇస్తున్న డీఎస్పీ పృథ్వీతేజ


చెన్నేకొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు ప్రజలకు సూచించారు. గురువారం మండల పరిధిలోని కనుముక్కల గ్రామంలో స్థానిక పోలీసులతో పాటు ప్రత్యేక భద్రతా బలగాలతో ధర్మవరం డీఎస్పీ పృథ్వీతేజ, రామగిరి సీఐ శివ అంజనేయులు కవాతు నిర్వహించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న భద్రతా సిబ్బంది గ్రామంలోని ప్రధాన వీధుల్లో కవాతు చేపట్టారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ పృథ్వీతేజ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో నిబంధనలు అతిక్రమించరాదన్నారు. పోలింగ్ జరిగే వరకూ గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. అనవసరంగా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పోలీసులు గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారన్నారు. సమావేశంలో చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యువర్స్

● స్పేస్ టెక్ స్టార్టప్

అంతరిక్షంలో అగ్ని సంతకం





● శ్రీనాథ్ రవిచంద్రన్ ● మోహిన్

ఏరో స్పేస్ టెక్నాలజీ అనగానే విదేశాల వైపు చూసే ఎంతో మందికి మన సత్తా చూపించిన స్టార్టప్‌లలో 'అగ్నికుల్ కాస్మోస్' ఒకటి. ఆకాశమంత కలతో బయలుదేరిన 'అగ్నికుల్' అమ్ముల పొదిలో దివ్యాస్త్రం అగ్నిబాణ్....

'అగ్నికుల్' అంటే భారత అంతరిక్ష రంగంలో ఆత్మనిర్భర్ విజయగాథ.

ఐఐటీ–మద్రాస్ కేంద్రంగా పని చేస్తున్న 'అగ్నికుల్ కాస్మోస్' త్రీడీ ప్రింటెడ్ రాకెట్ ఇంజిన్‌ను తయారు చేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ప్రశంసలు అందుకుంది. స్నేహితుడు మోహిన్, ప్రొఫెసర్ చక్రవర్తిలతో కలిసి 2017లో 'అగ్నికుల్'ను లాంచ్ చేశాడు శ్రీనాథ్ రవిచంద్రన్. మన దేశంలోని ఫస్ట్ ప్రైవేట్ స్మాల్ శాటిలైట్ రాకెట్ 'అగ్నిబాణ్'ను నిర్మించింది అగ్నికుల్. 30 కిలోల నుండి 300 కిలోల బరువు ఉన్న పేలోడ్‌ను తక్కువ భూకక్ష్యలోకి (సుమారు ఏడువందల కిలోమీటర్ల ఎత్తు) తీసుకువెళ్లే సామర్థ్యం దీని సొంతం. 2020లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)తో ఒప్పందం కుదుర్చుకున్న తొలి భారతీయ కంపెనీగా ప్రత్యేకత సాధించింది అగ్నికుల్. ఒప్పందం ద్వారా 'అగ్నిబాణ్' నిర్మాణంలో 'ఇస్రో' సహాయ, సహకారాలను తీసుకుంది.

ప్లగ్–అండ్–ప్లే ఇంజిన్ కాన్ఫిగరేషన్ సామర్థ్యం ఉన్న అగ్నిబాణ్, మిషన్ అవసరాలకు ఖచ్చితంగా సరిపోయేలా కాన్ఫిగర్ చేయగలదు. ప్రతి క్లయింట్‌కు సంబంధించిన ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా కాన్ఫిగర్ చేయవచ్చు. 3డీ సాంకేతికతతో రూపొందించిన ఈ రాకెట్ ఉపగ్రహ ప్రయోగాల ఖర్చును తగ్గిస్తుంది.

మొదట్లో వారానికి కనీసం రెండు రాకెట్ ఇంజిన్‌లను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకొని ఆ తరువాత నాలుగు ఇంజిన్‌లకు విస్తరించింది అగ్నికుల్. ఒక్కో అడుగు వేస్తూ ముందుకు వెళ్లింది.

'మోర్ యాక్సెసబుల్ అండ్ అఫర్డబుల్' లక్ష్యంతో బయలు దేరిన శ్రీనాథ్ రవిచంద్రన్, మోయిన్‌లు మరిన్ని లక్ష్యాలు నిర్దేశించుకోవడానికి రెడీ అవుతున్నారు.



● శ్రీనాథ్ రవిచంద్రన్ 'అగ్నికుల్' కో–ఫౌండర్, సీయివో

ఆత్మవిశ్వాసమే అద్భుత శక్తి

2017లో 'అగ్నికుల్'తో శ్రీనాథ్ రవిచంద్రన్, మోయిన్‌లు ప్రయాణం మొదలు పెట్టినప్పుడు ఇన్వెస్టర్‌ల నుంచి విశ్లేషకుల వరకు 'మన దేశంలో ఇది సాధ్యమా? ఈ కుర్రాళ్ల వల్ల అవుతుందా' అనే అనుమాన నీడ ఉండేది. అయితే శ్రీనాథ్, మోహిన్‌లు ఎప్పుడూ ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. ఆత్మవిశ్వాసం అనే అద్భుతశక్తితో ముందుకు కదిలారు. నాలుగు వందల వరకు పిచ్ మీటింగ్‌లు నిర్వహించిన తరువాతే ఫస్ట్ రౌండ్ ఫండింగ్ 2018లో వచ్చింది. అనుమాన నీడ వెనక్కి వెళ్లి 'అగ్నికుల్' పేరు ప్రపంచానికి పరిచయం కావడానికి ఎంతోకాలం పట్టలేదు. మన దేశంలో స్పేస్ టెక్ స్టార్టప్‌ల విజయాన్ని దృష్టిలో పెట్టుకొని 'ఏరోస్పేస్ డిగ్రీలు చేయడానికి చాలామంది విదేశాలకు వెళ్లాలనుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇక్కడే ఉండాలనుకుంటున్నారు' అంటున్నాడు 'అగ్నికుల్' కో–ఫౌండర్, సీయివో శ్రీనాథ్ రవిచంద్రన్.

● శ్రీహరి కోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లోని ప్రైవేట్ లాంచ్ ప్యాడ్ నుంచి ఈరోజు లాంచ్ చేయాల్సిన 'అగ్నిబాణ్' సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది.

● గేమింగ్

వేయి కన్నుల శత్రువు వేట



హరైజన్ జీరో డాన్ (2017) గేమ్‌కు సీక్వెల్‌గా వచ్చిన యాక్షన్–రోల్ ప్లేయింగ్ గేమ్ హరైజన్ ఫర్‌బిడెన్ వెస్ట్(పీసీ) విడుదలైంది. థర్డ్–పర్సన్ పర్‌స్పెక్టివ్‌లో ఆడే గేమ్ ఇది. ప్రమాదకరమైన ఆయుధాలతో నిండిన 'అలోయ్' అనే హంటర్‌ను ప్లేయర్ కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. నోరా తెగకు చెందిన యంగ్ హంటర్ అలోయ్ శాస్త్రవేత్త ఎలిజబెత్ సోటెక్ క్లోన్. 'మిస్టీరియస్ ప్లేగ్' మూలాన్ని తెలుసుకోవడానికి తన బృందాన్ని ఫర్‌బిడెన్ వెస్ట్ అని పిలవబడే సరిహద్దు ప్రాంతానికి తీసుకువెళుతుంది. ఆలోయ్ తన ప్రయాణంలో భారీ తుఫానులను, సంచార తెగలతో యుద్ధాలను ఎదుర్కొంటుంది. పచ్చనిలోయల నుంచి శిథిలమైన నగరాల వరకు ఆలోయ్ ప్రయాణంలో ఎన్నో దృశ్యాలు కనిపిస్తాయి. గత గేమ్‌తో పోల్చితే ఈ గేమ్ మ్యాప్ పెద్దగా ఉంటుంది. షీల్డ్ వింగ్, ఫోకస్ స్కానర్, డైవింగ్ మాస్క్, పుల్‌కాస్టర్‌లాంటి టూల్స్‌ను కంబాట్‌లో ఉపయోగించవచ్చు.

- ప్లాట్‌ఫామ్స్: ప్లే స్టేషన్ 4, ప్లే స్టేషన్ 5,
- విండోస్ జానర్: యాక్షన్, అడ్వెంచర్ ● మోడ్: సింగిల్–ప్లేయర్


● అదర్‌సైడ్

సామాజిక సేవ నుంచి సైన్స్ వరకు

బెంగళూరుకు చెందిన సియా గోడికా పేరు వినిపించగానే 'సోల్ వారియర్స్' గుర్తుకు వస్తుంది. 'సోల్ వారియర్స్' స్వచ్ఛంద సంస్థ ద్వారా పేదలకు పాదరక్షలను అందిస్తుంది సియా. 'చేంజ్‌మేకర్'గా గుర్తింపు పొందిన సియా గోడికా చదువులోనూ ప్రతిభ చూపుతోంది. 'ప్లూరిపోటెంట్ స్టెమ్ సెల్స్' గురించి ఆమె చేసిన సైన్స్ వీడియో 'బ్రేక్‌త్రూ జూనియర్ చాలెంజ్'లో బహుమతి గెలుచుకుంది. సైన్స్, మ్యాథమెటిక్స్‌కు సంబంధించి క్రియేటివ్ థింకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌కు ఇచ్చే ప్రైజ్ ఇది.



● సియా గోడికా



సేవామార్గంలో ప్రయాణించడంతో పాటు క్రియేటివ్ థింకింగ్ కోసం పుస్తకాలు ఎక్కువగా చదువుతుంటుంది సియా. సైన్స్‌కు సంబంధించిన సరికొత్త విషయాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తుంటుంది.

'ఇంట్లో పిల్లలకు ప్రోత్సాహకరమైన వాతావరణం ఉంటే గొప్ప విజయాలు సాధించవచ్చు' అని చెప్పడానికి సియా ఒక ఉదాహరణ.

సేవాకార్యక్రమాలకు తమ వంతుగా సహాయపడడం నుంచి సైన్స్ సంగతులు చెప్పడం వరకు సియా గోడికాకు ఎన్నో రకాలుగా ఆమె తల్లిదండ్రులు సహకారం అందించారు.

English Idioms

కీప్ కార్డ్స్ క్లోజ్ టు చెస్ట్

ప్లాన్, ఇంటెన్షన్, ఇన్‌ఫర్‌మేషన్‌లను రహస్యంగా ఉంచే సందర్భంలో వాడే మాట...
కీప్ కార్డ్స్ క్లోజ్ టు చెస్ట్.
ఉదా: ది చిల్డ్రన్ డిడ్ నాట్ నో వేర్ దే వర్ టు గో ఫర్ దెయిర్ ఫ్యామిలీ హాలిడే ట్రిప్. దెయిర్ డ్యాడ్ కెప్ట్ హిజ్ కార్డ్స్ క్లోజ్ టు హిజ్ చెస్ట్.

పుష్ ది బోట్ ఔట్

సెలబ్రేషన్ లేదా ఏదైనా కార్యక్రమం కోసం డబ్బును కుమ్మరించే సందర్భంలో వాడే మాట...
పుష్ ది బోట్ ఔట్
ఉదా: లెట్ అజ్ పుష్ ది బోట్ ఔట్ అండ్ సెలబ్రేట్ ది విన్ విత్ ఏ ఫ్యాన్సీ డిన్నర్ నైట్

● టెక్... టాక్

ఆసూస్ జెన్‌ఫోన్ 11 ఆల్ట్రా



డిస్‌ప్లే	:	6.78 అంగుళాలు
రిజల్యూషన్	:	1080X2400 పిక్సెల్స్
మెమోరీ	:	256జీబి 12జీబి ర్యామ్/ 512 జీబి 16జీబి ర్యామ్
ఓఎస్	:	ఆండ్రాయిడ్ 14
ఫ్రంట్ కెమెరా	:	32 ఎంపీ
బ్యాటరీ	:	5500 ఎంఏహెచ్
బరువు	:	224 గ్రా.

హానర్ వాచ్ జీఎస్ 4



● హార్ట్ రేట్ మానిటరింగ్, స్లీప్ ట్రాకింగ్, స్ట్రెస్ అండ్ బ్లడ్ ఆక్సిజన్ లెవెల్ మెజరింగ్‌లాంటి హెల్త్ అండ్ ఫిట్‌నెస్ ఫీచర్‌లు ఉన్నాయి ● 100 ప్లస్ ఇండోర్ అండ్ ఔట్‌డోర్ మోడ్స్, కస్టమ్ స్పోర్ట్స్ మోడ్స్, 10 ప్లస్ ప్రొఫెషనల్ స్పోర్ట్స్ మోడ్స్‌ను సపోర్ట్ చేస్తుంది. ● రిజల్యూషన్: 466X466 పిక్సెల్స్ ● స్టోరేజ్: 4జీబి ● 5 ఏటీయం వాటర్ రెసిస్టెంట్ ● 32 ఎంబీ ర్యామ్

బింగ్ ఏఐ హోలీ చిత్రాలు

ఆకట్టుకునే ఇమేజ్‌లతో ఫ్రెండ్స్‌కు హోలి శుభాకాంక్షలు తెలియజేయాలనుకుంటున్నారా? అయితే ఇది మీ కోసమే... మైక్రోసాఫ్ట్ వారి 'బింగ్ ఏఐ ఇమేజ్ క్రియేటర్'ను ఉపయోగించి 3డీ హోలీ థీమ్ ఇమేజ్‌లను క్రియేట్ చేయవచ్చు. సింపుల్ ప్రాంప్ట్స్ ద్వారా 'బింగ్ ఏఐ ఇమేజ్ క్రియేటర్'పై హోలి ఇమేజ్‌లు క్రియేట్ చేయవచ్చు. వీటిని ఆండ్రాయిడ్ అండ్ ఐవోఎస్, డెస్క్‌టాప్‌లతో యాక్సెస్ చేయవచ్చు. జెనరేట్ అయిన ఇమేజ్‌లు మీకు అంతగా నచ్చకపోతే 'మేక్ దెమ్ మోర్ కలర్‌ఫుల్ అండ్ వైబ్రంట్' 'మేక్ దెమ్ డిటేయిల్డ్' 'మేక్ దెమ్ లుక్ ఫొటో–రియలిస్టిక్' లాంటి ప్రాంప్ట్స్ ఇవ్వవచ్చు.



ఇమోజీ రియక్షన్ ఫీచర్



కమ్యూనికేషన్‌ను మరింత సులభతరం చేయడానికి 'గూగుల్ మెసేజెస్' చాట్స్‌లో ఇమోజీ రియాక్షన్ ఫీచర్ తీసుకువచ్చింది. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఐమెసేజ్‌లలో మాదిరిగానే ఈ ఫీచర్‌ని ఉపయోగించవచ్చు. రియాక్షన్ ఇమోజీ జోడించడానికి పర్టిక్యులర్ ఎస్ఎంఎస్‌ను లాంగ్ ప్రెస్ చేస్తే ఇమోజీ మెనూ కనిపిస్తుంది. దీని నుంచి మనకు కావలసిన ఇమోజీని సెలెక్ట్ చేసుకోవచ్చు. థమ్స్ అప్, రెడ్ హార్ట్, లాఫింగ్ ఇమోజీ, థమ్స్ డౌన్, క్రైయింగ్ ఫేస్‌లాంటి పది ఇమోజీ క్యారెక్టర్లు ఇందులో ఉంటాయి.

సినిమా

తగ్గేదే లే!



● అల్లు అర్జున్

హీరో అల్లు అర్జున్ మరో ఘనత సాధించారు. సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రామ్‌లో అల్లు అర్జున్‌ని ఫాలో అయ్యేవారి సంఖ్య (ఫాలోవర్స్) 25 మిలియన్స్‌కు చేరుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఇంతమంది ఫాలోవర్స్ ఉన్న తొలి దక్షిణాది నటుడిగా అల్లు అర్జున్ రికార్డ్ సృష్టించి, తగ్గేదే లే అంటున్నారు. 'పుష్ప: ది రైజ్' సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో అభిమానులను సొంతం చేసుకున్నారు అల్లు అర్జున్. అదే విధంగా ఆ మూవీకి ఉత్తమ నటుడి కేటగిరీలో తెలుగులో జాతీయ అవార్డు సాధించిన తొలి హీరోగా అరుదైన ఘనత సాధించారాయన. కాగా సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ ఎప్పటికప్పుడు సినిమా, వ్యక్తిగత విషయాలను అభిమానులతో పంచుకుంటారు అల్లు అర్జున్. అందులో భాగంగానే దక్షిణాదిలో అత్యధిక ఇన్‌స్టా ఫాలోవర్స్ ఉన్న హీరోగా రికార్డ్‌ను క్రియేట్ చేశారు. ఆ తర్వాతి స్థానంలో హీరో విజయ్ దేవరకొండ (21.3 మిలియన్లు), మూడో స్థానంలో హీరో రామ్ చరణ్ (20.8మిలియన్లు) ఉన్నారు.

భాగ్యనగరంలో పూర్తి



● కీరవాణి, త్రిష, చిరంజీవి

చిరంజీవి హీరోగా నటిస్తున్న 'విశ్వంభర' చిత్రం హైదరాబాద్ షెడ్యూల్ పూర్తి చేసుకుంది. 'బింబిసార' చిత్రంతో బ్లాక్‌బస్టర్ అందుకున్న వశిష్ఠ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. 'స్టాలిన్' (2006) వంటి హిట్ మూవీలో జోడీగా నటించిన చిరంజీవి–త్రిష 'విశ్వంభర' మూవీ కోసం రెండోసారి కలిశారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ చిత్రం నిర్మిస్తున్నారు. కాగా ఇటీవల హైదరాబాద్‌లో మొదలైన 'విశ్వంభర' షెడ్యూల్ పూర్తయినట్లు మేకర్స్ ప్రకటించారు. చిరంజీవి, త్రిషతో పాటు ప్రధాన తారాగణం పాల్గొన్న ఈ షెడ్యూల్‌లో కొంత టాకీ పార్ట్, ఓ పాట, యాక్షన్ బ్లాక్‌ని చిత్రీకరించినట్లు యూనిట్ పేర్కొంది. ''ఫ్యాంటసీ అడ్వెంచర్‌గా రూపొందుతున్న చిత్రం 'విశ్వంభర'. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ మూవీ ఉంటుంది. 2025 సంక్రాంతి కానుకగా జనవరి 10న ఈ సినిమాని విడుదల చేస్తాం'' అని చిత్రబృందం తెలిపింది. ఇదిలా ఉంటే.. చిరంజీవి నివాసంలో చిత్ర సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణితో సహా యూనిట్‌తో దిగిన ఫొటోలను త్రిష సోషల్ మీడియాలో షేర్ చేసి, 'ఇదొక లెజెండరీ, అద్భుతమైన రోజు! విశ్వంభర' అని పోస్ట్ చేశారు. ఈ చిత్రానికి కెమెరా: ఛోటా కె. నాయుడు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కార్తీక్ శబరీష్, లైన్ ప్రొడ్యూసర్: రామిరెడ్డి శ్రీధర్ రెడ్డి.

కాంబినేషన్ రిపీట్



● రామ్‌చరణ్

'రంగస్థలం' కాంబినేషన్ రిపీట్ కానుందని టాక్. హీరో రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన బ్లాక్ బస్టర్ ఫిల్మ్ 'రంగస్థలం' (2018). కాగా రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో మరో సినిమాకు సన్నాహాలు మొదలయ్యాయట. ఈ నెల 27న రామ్‌చరణ్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన వెల్లడి కానుందని తెలిసింది. 'రంగస్థలం' సినిమాను నిర్మించిన మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందని, దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తారని భోగట్టా.

చరణ్ సినిమాలో సంజయ్ దత్?

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్న ఈ సినిమాలో కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ ఓ కీలక పాత్ర చేయనున్నారు. అలాగే బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో కనిపిస్తారనే టాక్ తెరపైకి వచ్చింది. ఇక హిందీలో రామ్ చరణ్ చేసిన తొలి చిత్రం 'తుఫాన్'లో సంజయ్ దత్ ఓ రోల్ చేశారు. మరి.. రామ్‌చరణ్, సంజయ్ దత్ మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకుంటారా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

గోదావరి నేపథ్యంలో...

'పలాస 1978' ఫేం రక్షిత్ అట్లూరి హీరోగా, కోమలీ ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'శశివదనే'. సాయి మోహన్ ఉబ్బర దర్శకుడు. గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి మాట్లాడుతూ– ''మా సినిమాని ఏప్రిల్ 5న రిలీజ్ చేద్దామనుకున్నాం. కానీ డిస్ట్రిబ్యూటర్స్ అడిగిన మేరకు 19న రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు. ''గోదావరి నేపథ్యంలో లవ్ అండ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన చిత్రం 'శశివదనే''' అన్నారు సాయి మోహన్ ఉబ్బర. ''నా 'పలాస 1978' కంటే 'శశివదనే' పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు రక్షిత్ అట్లూరి. కోమలీ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీపాల్, సినిమాటోగ్రాఫర్ శ్రీసాయి కుమార్ దారా మాట్లాడారు.



● కోమలీ ప్రసాద్, రక్షిత్ అట్లూరి

అయోమయం.. ఆశ్చర్యం



● 'దో ఔర్ దో ప్యార్' మూవీ పోస్టర్

విద్యాబాలన్, ప్రతీక్ గాంధీ, ఇలియానా, సెంథిల్ రామమూర్తి లీడ్ రోల్స్‌లో నటించిన బాలీవుడ్ రొమాంటిక్ కామెడీ ఫిల్మ్ 'దో ఔర్ దో ప్యార్'. శీర్ష గుహ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఏప్రిల్ 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. 'నేను వీగన్... పాలతో తయారైన వాటిని తినను (విద్యాబాలన్)', 'మరి.. మీ ఫేస్ వాష్‌లలో మిల్క్ ఉంటుంది కదా (ప్రతీక్ గాంధీ)!', 'మనం డేటింగ్‌లో ఉన్న వారిలా లేము.. నిజంగా భార్యాభర్తలు ఎలా ఉంటారో అలానే ఉంటున్నాం (ఇలియానా)' వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. 'ప్రేమ కన్‌ఫ్యూజ్ చేస్తుంది. సర్‌ప్రైజ్ చేస్తుంది' అన్నవి కూడా టీజర్‌లో కనిపించాయి.

గుండెల్లోన.. ప్రేమవాన!

నార్నే నితిన్, నయన్ సారిక హీరోహీరోయిన్లుగా అంజి కంచిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆయ్'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'సూఫియానా.. గుండెల్లోన ప్రేమవాన..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. రామ్‌మిరియాల సంగీత సారథ్యంలో శ్రీమణి ఈ పాటకు లిరిక్స్ అందించారు. రామ్ మిరియాల, సమీర భరద్వాజ్, రమ్యశ్రీ పాడారు.



● నయన్ సారిక, నార్నే నితిన్

మళ్లీ స్పైడర్‌మేన్ వస్తున్నాడు



● స్పైడర్‌మేన్ నో వే హోమ్ పోస్టర్

హాలీవుడ్ సూపర్ హిట్ సూపర్ హీరో 'స్పైడర్ మేన్' మళ్లీ థియేటర్స్‌కు వస్తున్నాడు. స్పైడర్‌మేన్ ఫ్రాంచైజీలో ఇప్పటి వరకూ ఎనిమిది సినిమాలు వచ్చాయి. 'స్పైడర్‌మేన్' (2002), 'స్పైడర్‌మేన్ 2' (2004), 'స్పైడర్‌మేన్ 3' (2007), 'ది అమేజింగ్ స్పైడర్‌మేన్' (2007), 'ది అమేజింగ్ స్పైడర్‌మేన్ 2' (2014), 'స్పైడర్‌మేన్: హోమ్ కమింగ్' (2017), 'స్పైడర్‌మేన్: ఫార్ ఫ్రమ్ హోమ్' (2019), 'స్పైడర్‌మేన్: నో వే హోమ్' (2021)... ఈ 8 చిత్రాలూ రీ రిలీజ్ కానున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ కొలంబియా పిక్చర్స్ వంద సంవత్సరాలను పూర్తి చేసుకున్న సందర్భంగా 'స్పైడర్‌మేన్' ఫ్రాంచైజీ సినిమాలను రీ రిలీజ్ చేస్తోందని హాలీవుడ్ సమాచారం. ఈ 8 సినిమాలకు సంబంధించి ఓ కామన్ ట్రైలర్‌ను కూడా రిలీజ్ చేశారు. ఈ చిత్రాలు కూడా ఏప్రిల్ 15 నుంచి వారానికి ఒక్కొక్కటి చొప్పున జూన్ 3 వరకు విడుదలవుతాయి. ప్రతి చిత్రం కూడా సోమవారమే రీ –రిలీజ్ కానుండటం విశేషం. ఎంపిక చేసిన థియేటర్స్‌లోనే ఈ సినిమాలు రీ రిలీజ్ కానున్నాయి.

ఆ ఒత్తిడి ఎదుర్కొన్నా!

– దర్శకుడు మల్లిక్ రామ్



''డీజే టిల్లు'(2022) సినిమాకి సీక్వెల్‌గా వస్తున్న 'టిల్లు స్క్వేర్'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ఎలాగైనా హిట్ కొట్టాలి, వారి అంచనాలు అందుకోవాలనే ఒత్తిడితో 'టిల్లు స్క్వేర్' తీశాను. ఫైనల్ ఔట్‌పుట్ చూశాక సినిమా బాగా వచ్చింది.. ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుందనే నమ్మకంతో రిలీఫ్ అయ్యాను'' అని దర్శకుడు మల్లిక్ రామ్ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మల్లిక్ రామ్ మాట్లాడుతూ– ''నేను, సిద్ధు, ప్రశాంత్ వర్మ, తేజ సజ్జా... మేమంతా ఈ స్థాయికి రావడం కోసం 12 ఏళ్లుగా కష్టపడుతున్నాం. ఇప్పుడు కలిసి సినిమాలు చేస్తున్నాం. సిద్ధు బాగా నటించాడు. లిల్లీ పాత్రకి అనుపమ నూటికి నూరు శాతం న్యాయం చేసింది. నిర్మాతలు రాధాకృష్ణ, నాగవంశీ, సాయి సౌజన్యగార్లు బడ్జెట్ గురించి ఎప్పుడూ మాట్లాడలేదు. కంటెంట్ గురించి, క్వాలిటీ గురించే ఎక్కువ మాట్లాడారు. ఏ విషయంలో రాజీ పడలేదు.. అందుకే కొన్ని సన్నివేశాలు రీ షూట్ చేశాం. ఒక్కమాటలో చెప్పాలంటే 'డీజే టిల్లు' నచ్చినవారిని 'టిల్లు స్క్వేర్' ఏమాత్రం నిరాశపరచదు. ఇక 'టిల్లు 3'కి అవకాశం ఉందా అంటే.. కొన్ని ఆలోచనలు ఉన్నాయి. భవిష్యత్తులో మూడో భాగం ఉండొచ్చు''అన్నారు.